పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, మే 31: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతిపై మండలాల వారీగా అధికారులతో సమీక్షించారు. మిగిలిన పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పాఠశాలలను సందర్శించి, జూన్ 10లోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. అలాగే, ఏకరూప దుస్తుల తయారీపై సమీక్షించి, కుట్టడం పూర్తయిన యూనిఫాంను హెచ్‌ఎంల ద్వారా విద్యార్థులకు అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యదేవి, డీఈవో వాసంతి పాల్గొన్నారు.

9న గ్రూప్-1 ప్రిలిమ్స్

ఈ నెల 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసే అభ్యర్థులకు టీజీపీఎస్సీ కార్యదర్శి పలు సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య తెలిపారు. ఓఎంఆర్ విధానంలో ప్రిలిమినరీ పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి https://www.tspsc.gov.inలో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థులు విలువైన వస్తువులను వెంట తీసుకొస్తే వాటిని భద్రపర్చడానికి ఎలాంటి క్లాక్ రూమ్/స్టోరేజీ సదుపాయం ఉండదని సూచించారు. ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని సందర్శించాలని కోరారు.

రేపు ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఉదయం 8.15 గంటలకు ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం వరంగల్ కలెక్టరేట్‌లో వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, 9.10 గంటలకు పోలీసు గౌరవ వందనం, అనంతరం ప్రసంగం ఉంటుందని వెల్లడించారు.

నేడు 'సుమతిరెడ్డి'లో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, మే 31: అనంతసాగర్‌లోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్-2024ను శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, కాగ్నిజెంట్ టెక్నాలజీ హెచ్‌ఆర్, మేనేజర్ జితేందర్‌సింగ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. చివరి సంవత్సరంలోని 282 మంది విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీలో 100 శాతం ఉద్యోగాలు వచ్చాయన్నారు. సమావేశంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేశ్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని కష్టాలు

ఆలయ సమీపంలో పగిలిన పైపులు

ఖిలావరంగల్, మే 31 : ఓ వైపు అధిక ఉష్ణోగ్రతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు గుక్కెడు నీటితో గొంతు తడుపుకోవడం కష్టంగా మారింది. పగిలిన పైపులను సరిచేసే పని మాదికాదంటే.. మాది కాదంటూ ఒకరిపై మరొకరు నెట్టివేసుకుంటుండడంతో పది రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ పుప్పాలగుట్టలో జరుగుతున్న ఈ తీరుకు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతల్ ఆర్వోబీ నుంచి శివనగర్ రైల్వేస్టేషన్ మార్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. కట్టమైసమ్మ ఆలయ సమీపంలో పైపులైన్ పగిలిపోయింది. మరమ్మతు విషయంలో అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రజలు తీవ్ర నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించకుంటే బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

కాశీబుగ్గ, మే 31 : న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వెంకట్రామ జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ దవాఖాన వద్ద బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. గిర్మాజీపేటకు చెందిన ఐలోని వాణి(46) కిడ్నీ వ్యాధితో దవాఖానలో చేరగా ఆపరేషన్ చేశారు. 15 రోజులైనా నయం కాకపోగా తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో మెరుగైన వైద్యం కోసం గత నెల 24న హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. మిల్స్‌కాలనీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు సర్ది చెప్పి పంపించారు. కాగా, డాక్టర్ పోలా నట రాజ్ మాట్లాడుతూ వైద్యానికి ఆమె శరీరం సహకరించకపోవడం వల్ల హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. ఎలాంటి పొరపాటు జరుగలేదని పేర్కొన్నారు.

కార్మిక వ్యతిరేకి కాంగ్రెస్ పార్టీ

- ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి
- కార్మిక సదస్సులో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, చిత్రంలో ఎమ్మెల్సీ సారయ్య

హనుమకొండ, మే 31 : కాంగ్రెస్ కార్మిక వ్యతిరేక పార్టీ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అండ్ స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారానికి శుక్రవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్మిక సంఘం నాయకుడు నాయిని రవి అధ్యక్షతన కార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కార్మికులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్మిక భవనం కోసం 2,400 గజాల స్థలాన్ని కేటాయించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి స్టీట్ నుంచి స్టేట్ వరకు పోరాటం చేస్తానన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, వారి కుటుంబాలకు నెలకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ భవన్ వేదికగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. పదేళ్లలో 24 మంది కార్మికుల పిల్లలను డాక్టర్లు చేయడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని దాస్యం తెలిపారు.

జీవోలను గౌరవించడం ధర్మం :ఎమ్మెల్సీ సారయ్య

జారీ చేసిన జీవోలను గౌరవించడం మన ధర్మమని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. ఆపదలో ఆదుకున్న వాడే నాయకుడని, అలాంటి వ్యక్తి దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ప్రస్తుతం కార్మికుల డిమాండ్ల సాధన కోసం పోరాడాలన్నారు. త్వరలోనే ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని కలిసి కార్మికుల సమస్యలను వివరిస్తామన్నారు. బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎంజలా మల్లేశం, రవీందర్‌రెడ్డి, సంజీవ్, కాటాపూర్ రాజు, ఇస్మాయిల్, సతీశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సర్వర్, ప్రణయ్ పాల్గొన్నారు.

తీర్మానాలు

- ఆటో కార్మికుల కుటుంబాలకు జీవనోపాధికి ప్రతినెల రూ.15,000ల భృతి ఇవ్వాలి.
- బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక సంక్షేమ భవనాల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టి, భవనాలు నిర్మించాలి.
- భవన నిర్మాణ కార్మికుల 6వేల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, నిధులు మంజూరు చేయాలి.
- ఈఎస్ఐ హాస్పిటల్స్ నిర్వహణలో జాప్యం, మందులు, వైద్య పరికరాల కొరత, డిస్పెన్సరీల నిర్వహణకు సరిపడా నిధులు కేటాయించి మెరుగుపర్చాలి.
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, యాజమాన్యాలతో కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో నిధులు జమచేయించాలి.
- చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకుల ద్వారా ఆర్థిక ప్రోత్సాహం అందించాలి.
- ఇళ్లల్లో పనిచేసే కార్మికులకు కార్మిక చట్టం-2008 ప్రకారం గుర్తింపు కార్డులు ఇచ్చి, పెన్షన్ వర్తింపజేయాలి.
- హోటల్, లాడ్జింగ్ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, కనీస వేతనం కల్పించాలి.
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి.
- గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ కేంద్రాల్లో కూడా వర్తింపజేయాలి.
- కార్మిక నివాస ప్రాంతాల్లో కార్మిక శాఖ మెడికల్ క్యాంపులు నిర్వహించాలి.

పేదల పెన్నిధి తుమ్మబాల

ఆయన మృతితో శోక సముద్రంలో క్రైస్తవ సమాజం

నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాజీపేట, మే 31 : బిషప్ తుమ్మ బాల మరణంతో క్రైస్తవ సమాజం శోకసముద్రంలో మునిగిపోయింది. పేద ప్రజల కోసం విద్యా సంస్థలు, వైద్య సేవలను అందించేందుకు దవాఖానలు నెలకొల్పిన ఘనత బిషప్ తుమ్మ బాలకే దక్కుతుంది. వరంగల్ మేత్రాసన పీఠంలో 25 ఏండ్లు సేవలు అందించిన తుమ్మ బాల మరణం పేద ప్రజలకు తీరని లోటని చెప్పవచ్చు. పేదలు విద్యతోనే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారనే లక్ష్యంతో నగరంలో అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, క్రీస్తు జ్యోతి లాంటి సాంకేతిక విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు 20 ఏళ్ల క్రితమే నగరంలోని మెడికేర్ దవాఖానకు అకురార్పణం చేశారు. గతేడాది ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(మెడికల్ కళాశాల) ఏర్పాటైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా నర్మెట గ్రామంలో 1944లో జోజి రెడ్డి-ఇన్నమ్మ దంపతులకు తుమ్మ బాల జన్మించారు. వరంగల్ మేత్రాసన పీఠాధిపతి, బిషప్‌గా 1987లో బాధ్యతలు స్వీకరించారు. 25 ఏళ్ల పాటు సేవలందించి 2011లో హైదరాబాద్ ఆర్చ్ బిషప్‌గా బదిలీపై వెళ్లారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ధర్మసాగర్ మండలం కరుణాపురం విద్యాజ్యోతి నిలయంలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ బసిలికాలో(చర్చి)కి తరలించి శుక్రవారం అంత్యక్రియలు చేశారు.

పార్థివదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి నివాళి..

సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో ప్రజల సందర్శనార్థం ఉంచిన తుమ్మ బాల పార్థివదేహాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ క్రైస్తవ దయాసిస్ అభివృద్ధికి తుమ్మ బాల ఎనలేని సేవ చేశారని కొనియాడారు.

యువతి అదృశ్యం

చెన్నారావుపేట, మే 31: యువతి అదృశ్యమైన ఘటన తోపనగడ్డతండాలో జరిగింది. తండాకు చెందిన పాను గంటి రజిత(17) గత నెల 27 నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం యువతి అన్న నరసింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో మామిడి పండ్లు మాయం

కాజీపేట, మే 31 : కాజీపేట రైల్వే స్టేషన్‌లో నాలుగు ట్రేల మామిడి పండ్లు చోరీకి గురయ్యాయి. బాధితుడు గుల్షన్ కథనం ప్రకారం.. వారణాసికి చెందిన ప్రతాప్, గుల్షన్ కొన్ని రోజుల క్రితం నగరానికి వలస వచ్చి మామిడి పండ్ల ప్యాకింగ్ కంపెనీలో పనిచేస్తున్నారు. ప్రతాప్ కుటుంబ సభ్యులు అనారోగ్యంగా ఉన్నారని సమాచారం రావడంతో శుక్రవారం స్వగ్రామానికి వెళ్లేందుకు నాలుగు ట్రేల మామిడి పండ్లు తీసుకుని గుల్షన్‌తో కలిసి ప్రతాప్ కాజీపేట స్టేషన్‌కు వచ్చాడు. దానాపూర్ రైలులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రతాప్ ఒక్కడే రైలు ఎక్కాడు. మామిడి పండ్లను ఎక్కించే లోపే రైలు వెళ్లిపోయింది. కాగా, స్టేషన్‌లో గుల్షన్ వద్ద టికెట్ లేకపోవడంతో టీసీ పట్టుకుని రూ.2వేలు ఫైన్ కట్టాలని అనడంతో డబ్బులు తీసుకొస్తానని పండ్లను అక్కడే ఉంచి బయటి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి పండ్లతో పాటు టీసీ కనబడకపోవడంతో అవాక్కయ్యాడు.

కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన ఉండాలి

ఏఆర్వో, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

మాట్లాడుతున్న గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, మే 31 : కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన ఉండాలని ఏఆర్వో, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం బల్దియా కౌన్సిల్ హాల్‌లో కౌంటింగ్ విధానంపై కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందికి సూచనలు చేశారు. తూర్పు నియోజవర్గ కౌంటింగ్ ప్రక్రియ సరళిపై వివరించారు. ఈ నియోజవర్గ పరిధిలోని 230 పోలింగ్ కేంద్రాలకు 14 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. 16 రౌండ్లలో కౌంటింగ్ ఉంటుందన్నారు. కంట్రోల్ యూనిట్‌పై ఉన్న పింక్ కలర్ పేపర్, సీల్ గ్రీన్‌పేపర్, అడ్రస్ ట్యాగ్‌లను ఏజెంట్లకు చూపిన తర్వాతే కౌంటింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. కౌంటింగ్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, ఎన్నికల డీటీ సుభాన్, మాస్టర్ ట్రైనీ సందీప్‌కుమార్, నాగరాజు, నాగేశ్వర్‌రావు, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు వార్డు అధికారుల నియమాకం..

పన్నులు వసూళ్లకు డివిజన్‌కో అధికారిని నియమించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పన్నుల వసూళ్ల బాధ్యత నుంచి తప్పించారు. రెగ్యులర్ బిల్ కలెక్టర్లు పన్నులు వసూలు చేయాలని గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మనోజ్‌కుమార్‌కు మెసెంజర్ విధులను అప్పగించారు.

అక్రమార్కులకు పట్టం

నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ పరీక్షల మూల్యాంకనం

హనుమకొండ చౌరస్తా, మే 31 : కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అసెంబ్లీ ఎలక్షన్ కోడ్‌కు ఒకరోజు ముందు తెలుగు విభాగంలో ముగ్గురికి పార్ట్‌టైం లెక్చరర్ నియామక ఉత్తర్వులు ఇవ్వడం అప్పట్లో వివాదాస్పదమైంది. ప్రభుత్వ అనుమతి లేకుండా, డిపార్ట్‌మెంట్ కమిటీ సిఫార్సులు లేకుండా ఎలా నియమించారని స్కాలర్స్ వీసీ, రిజిస్ట్రార్‌ను నిలదీసిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో రిజిస్ట్రార్‌కి మరో అనుచరుడైన జియాలజీ విభాగ ప్రొఫెసర్ స్కాలర్ వీరన్నను 2021-22లో పార్ట్‌టైమర్‌గా నియమించారు. వీరన్నకు 2023లో పీహెచ్‌డీ అవార్డు వచ్చింది. నిబంధనల ప్రకారం పార్ట్‌టైం ఉత్తర్వులు రద్దు కావాలి. ఈ క్రమంలో వీరన్నకు 2023-24 సంవత్సర డిగ్రీ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ఇవ్వడంపై పలు అభ్యంతరాలు వెల్లువెత్తాయి. ఇటీవల పేపర్లు దిద్దినందుకు వీరన్న రూ.36 వేలు బిల్లు పెట్టడంతో ఈ విషయం బయటకు వచ్చింది. రిజిస్ట్రార్ అనుచరుల స్కాలర్లకు అందలంపై విమర్శలు వస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం వివాదాస్పదమైంది.

ముగ్గురిపై కేసు నమోదు

రహస్యంగా ఉంచుతున్న కేయూ ఎస్సై

నయీంనగర్, మే 31 : విద్యార్థులను అడ్డదారిలో పాస్ చేయించేందుకు సహకరించిన కాకతీయ యూనివర్సిటీకి చెందిన ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులపై కేసు నమోదైనట్లు గురువారం తెలిసింది. వర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్ జిల్లా, ఆదిలాబాద్ జిల్లాలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులు 2వ, 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 6నుంచి నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల నుంచి జవాబు పత్రాలు కేయూ పరీక్షల విభాగానికి వస్తున్నాయి. ఈ క్రమంలో విభాగంలోని సీసీ కెమెరాకు ఒకరు అడ్డుగా నిలబడితే మరో ఇద్దరు ఏ విద్యార్థి పాస్ కావాలో అతడి అన్సర్ షీట్ బుక్‌లెట్‌ను మార్చే క్రమంలో దొరికినట్లు తెలిసింది. దీనిపై కేయూసీ ఎస్సై రాజ్ కుమార్‌ను వివరణ కోరగా, ఇది ఇప్పుడే చెప్పలేమని, విచారణ చేస్తున్నామని చెప్పాడు. కాగా, దొరికిన వారిని అదుపులో తీసుకుని విచారించి సుమారు 20 సెల్‌ఫోన్‌లను ఎస్సై ఆధీనంలో ఉంచుకున్నట్లు తెలిసింది. కాగా, ఈ విషయాన్ని రహస్యంగా ఉంచడం ఏమిటని ఎస్సైపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న వరంగల్ పోలీస్ షీ టీం బృందం

ఏకశిల పార్కులో షీ టీం అవగాహన

హనుమకొండ, మే 31 : బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో వరంగల్ పోలీస్ షీ టీం సభ్యుల ఆధ్వర్యంలో మహిళలకు రక్షణ, భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైతే 87126 85257, 87126 85142, 87126 85270 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏకశిలా పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పడాల సోమయ్య, గౌరవాధ్యక్షుడు చాడ దశరథ రామిరెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పచ్చిమట్ల ఎల్లాగౌడ్, ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి రాజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ సూర్యనారాయణ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశరాజుపల్లి వాసి త్రిమోతికి డాక్టరేట్

కమలాపూర్, మే 31 : మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన దాసరి త్రిమోతికి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ విభాగ సూపర్‌వైజర్ ఎడ్ల సుజాత ఆధ్వర్యంలో రాసిన 'స్క్రీనింగ్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ ల్యాక్సేసెస్ ఫ్రమ్ ఫంగల్ స్ట్రెయిన్స్ ఫర్ బయోరెమిడేషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎఫ్లూయంట్స్' అనే థీసిస్‌కు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు త్రిమోతి తెలిపారు. పేద కుటుంబంలో జన్మించి డాక్టరేట్ సాధించిన త్రిమోతిని గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇద్దరు సెకండియర్ విద్యార్థులు డిబార్

హనుమకొండ చౌరస్తా, మే 31 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిసినట్లు డీఐఈవో అజ్మీరా గోపాల్ తెలిపారు. ఉదయం జరిగిన కెమిస్ట్రీ, కామర్స్ మొదటి సంవత్సరం పరీక్షకు 1,615 విద్యార్థులకు 1,466 మంది పరీక్ష రాసినట్లు, మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షకు 5,301 మంది విద్యార్థులకు 4731 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. ఇద్దరి డిబార్ చేసినట్లు తెలిపారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం, మే 31: అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్ అకాడమీలో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు జూన్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసస్వామి తెలిపారు. బీఏ(హెచ్ఈపీ) 40 సీట్లు, బీఎస్సీ (ఎంపీసీ)లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9963584516 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అడవి పిల్లులకు ఉచ్చు.. బాలుడికి కౌన్సెలింగ్

శాయంపేట, మే 31 : అడవి పిల్లులు పట్టేందుకు ఉచ్చులు బిగించిన బాలుడికి వైల్డ్ లైఫ్ సొసైటీ బాధ్యులు మారేపల్లి సునీల్ శుక్రవారం కౌన్సెలింగ్ చేశారు. ప్రగతి సింగారంలో చలివాగు ప్రాజెక్ట్ పరిసరాల్లో ఏపీ నుంచి వచ్చిన బాతుల పెంపకం దారులు రాత్రిపూట బాతులను చంపి తింటున్నాయనే కారణంతో అడవి పిల్లులకు ఉచ్చులు పెడుతున్నారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

6 నుంచి సహకార సంఘాల ఎన్నికలు

ఖిలావరంగల్, మే 31 : వరంగల్ జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు ఈ నెల 6 నుంచి 28 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు సహకార ఎన్నికల అధికారి బీ సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మత్స్య, గృహ నిర్మాణ, కల్లుగీత, డైరీ, అర్బన్ సహకార బ్యాంక్, ప్లాట్ ఓనర్స్, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. సంఘాలు ప్రతిపాదనలు పంపించాలని కోరారు.

నేడు హనుమాన్ జన్మోత్సవం

ఖిలావరంగల్, మే 31: వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. టీటీడీ హనుమకొండ మేనేజర్ రఘువీర్, ఆలయ అధ్యక్షుడు మార్త రాజేందర్, తక్కెళ్లపల్లి సంపత్‌రావు, గాలి విద్యాసాగర్‌రావు, గునిగంటి సీతారామారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టైల్స్ మేస్త్రీ మృతి

హసన్‌పర్తి, మే 31 : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందాడు. నాగారం గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీకాంత్(34) టైల్స్‌మేస్త్రీగా పని చేస్తున్నాడు. బుధవారం కాటారం వెళ్లి పనులు ముగించుకొని సాయంత్రం తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. రాత్రి వంగపహాడ్‌కు చేరుకోగానే మలుపు వద్ద ఎదురుగా బైక్‌పై అతివేగంగా వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతూ శ్రీకాంత్ మృతి చెందాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సురేశ్ తెలిపారు.

గీసుగొండలో రెడ్ అలర్ట్

ఖిలావరంగల్, మే 31 : రోహిణి కార్తె ఆరంభం కావడంతో భానుడు వరంగల్ జిల్లాపై ప్రతాపం చూపుతున్నాడు. శుక్రవారం ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గీసుగొండ మండలం గొర్రెకుంటలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో టీఎస్‌డీపీఎస్ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

మట్టి, ఇసుక డంప్‌ల సీజ్

ఐనవోలు, మే 31 : అక్రమంగా నిల్వ చేసిన మట్టి, ఇసుక డంప్‌లను అధికారులు సీజ్ చేశారు. నందనం శివారు లింగమోరిగూడెం వద్ద అక్రమంగా మట్టి, ఇసుక నిల్వలు ఉన్నట్లు వచ్చిన సమాచారంతో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్సై అనిల్‌కుమార్ మైనింగ్ అధికారులతో కలిసి శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో 450 ట్రాక్టర్ల లోడ్‌ల మట్టి, ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశారు. అనుమతి లేకుండా పట్టా భూముల్లో ఇసుకను తీసి అక్రమంగా నిల్వ చేసిన లింగం రామచంద్రరెడ్డి, బుర్ర రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా, నందనం, ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నది. నందనం, రాంనగర్, కక్కిరాలపల్లి, లింగమోరిగూడెం గ్రామాల్లో ఎక్కువ శాతం మంది ఇసుక అక్రమ రవాణాను వృత్తిగా ఎంచుకొని జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. గ్రామాల శివారుల్లో సుమారు 20 మట్టి, ఇసుక డంప్‌లను ఏర్పాటు చేశారు. అయితే, మిగతా డంప్‌లను కూడా పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'చెరువు భూమిని కాపాడాలి'

చెన్నారావుపేట, మే 31: అక్కల్‌చెడ పరిధిలోని అక్కల చె